
సాక్షి ఒడిశా

గురువారం । 18 । మే । 2023



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయంలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన హుండీ ఆదాయాన్ని ఆలయ పాలకవర్గం బుధవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.3,89,588, బంగారం 2.45 గ్రాములు వచ్చాయని అధికారులు వెల్లడించారు.



ఇంటి వద్దే నమోదు చేయాలి

- 8లో



గురి తప్పొద్దు..

- 8లో

న్యూస్‌రీల్

విజిలెన్స్ వలలో బీఎస్ఎస్ఓ అధికారి



బెగునియాపడ బ్లాక్ కార్యాలయంలో విజిలెన్స్ అధికారులు



బీఎస్ఎస్ఓ అరుణ్ కుమార్ నాయక్

బరంపురం: విజిలెన్స్ వలలో మరో అవినీతి అధికారి చిక్కారు. గంజాం జిల్లా బెగునియాపడ బ్లాక్ కార్యాలయానికి చెందిన సామజిక సురక్షా అధికారి అరుణ్‌కుమార్ నాయక్ ఓ లబ్ధిదారునికి రేషన్ కార్డు మంజూరు చేసేందుకు రూ.6 వేలు డిమాండ్ చేశారు. ఈ సొమ్ము తీసుకుంటుండగా విజిలెన్స్ అధికార్లకు చిక్కారు. ఈ సందర్భంగా బరంపురం విజిలెన్స్ ఎస్పీ మయాధర్ స్వాయి అందించిన సమాచారం ప్రకారం జిల్లాలోని బెగునియాపడ బ్లాక్ పరిధి మాడ పంచాయతీకి చెందిన సర్పంచ్ బడియా స్వాయికి రేషన్‌కార్డు మంజూరు చేసేందుకు సామాజిక సురక్షా అధికారి అరుణ్‌కుమార్ నాయక్ రూ.6 వేలు ఇవ్వాలని కోరారు. దీంతో బరంపురం విజిలెన్స్ అధికార్లను ఆశ్రయించగా, పథకం ప్రకారం బుధవారం బెగునియాపడ బ్లాక్ కార్యాలయంలో బీఎస్ఎస్ఓ డబ్బు తీసుకుంటుండగా అధికార్లకు చిక్కారు. ఆధారాలు సేకరించిన అనంతరం అరెస్ట్ చేసి, కోర్టుకి తరలించామని ఎస్పీ వివరించారు.

క్వింటా గంజాయి పట్టివేత



పట్టుబడిన గంజాయితో పోలీసులు

బరంపురం: కొందమాల్, గజపతి, గంజాం జిల్లాల సరిహద్దుల నుంచి ఇతర రాష్ట్రాలకు గంజాయి అక్రమ రవాణా కొనసాగుతోంది. తాజాగా ఫిరింగియా పోలీసులు కళింగా ఘాటీ మీదుగా తరలిస్తున్న క్వింటా గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఐఐసీ అధికారి తపన్ కుమార్ మిశ్రా తెలిపిన వివరాల ప్రకారం బుధవారం ఉదయం కొందమాల్ జిల్లా సరిహద్దు మీదుగా గంజాయి రవాణా జరుగుతున్నట్లు సమాచారం అందింది. ఈ మేరకు ఫిరింగియా పోలీసులు కళింగా ఘాట్ రోడ్డులో మాటువేసి, అటుగా వస్తున్న ఆటోని అడ్డుకున్నారు. ఇందులో బస్తాల్లో నిల్వ చేసిన క్వింటా గంజాయి పట్టుబడింది. దీనికి సంబంధించి ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసి, సరుకును స్వాధీనం చేసుకున్నారు.

చిన్నారులను ఆదుకున్న చైల్డ్‌లైన్ అధికారులు



అలిగండలో తండ్రిని కోల్పోయిన చిన్నారులు

పర్లాకిమిడి: జిల్లా యంత్రాంగం మోహానా సమితి అలిగండ గ్రామంలో తండ్రిని కోల్పోయి, దీనావస్థలో ఉన్న ఐదుగురు మైనర్ బాలలను చైల్డ్‌లైన్, శిశు సంక్షేమశాఖ అధికారులు చేరదీశారు. అనంతరం వారిని పర్లాకిమిడి డెస్టర్ హోమ్‌కు తరలించారు. దీనికి సంబంధించి జిల్లా శిశు సంరక్షణ అధికారి అరుణ్‌కుమార్ త్రిపాఠి తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. అలిగండ పంచాయతీకి చెందిన జీవన్ మల్లిక్ ఆకస్మికంగా మృతి చెందడంతో భార్య శాంతి మల్లిక్ ఐదుగురు సంతానాన్ని పెంచలేక మానసిక వ్యాధితో బాధపడుతోంది. దీనిపై గ్రామస్తులు అధికారులను ఆశ్రయించగా.. ముగ్గురు చిన్నారులను చైల్డ్‌లైన్, శిశు సంరక్షణ సంస్థలకు అప్పగించారు. వారికి పునరావాసం కల్పించి, ప్రాథమిక విద్య అందించనున్నట్లు అధికారులు తెలిపారు. మిగతా ఇద్దరు బాలికలను ఉన్నత చదువులు, దత్తతపై సీడీపీఓ మోహానాకు వారి బంధువులు విన్నవించారు. అలాగే అంతరాబ గ్రామంలో లోకా బిర్ అనే వ్యక్తి మృతి చెందగా, వారి ఇద్దరు సంతానానికి ఆశ్రయం కల్పించాలని బంధువులు, గ్రామస్తులు కోరారు. దీంతో పర్లాకిమిడిలో డస్టర్ హోమ్(పునరావాస కేంద్రం)కు తరలించామని డీసీపీయూ అరుణ్‌కుమార్ త్రిపాఠి వివరించారు.



తండ్రిని కోల్పోయిన కుటుంబాన్ని పరామర్శిస్తున్నశిశు సంరక్షణ అధికారులు

సన్నద్ధతపై సమీక్ష..



అనుబంధ అధికార వర్గాలతో వైద్య ఏర్పాట్లపై సమీక్షిస్తున్న ఆరోగ్యశాఖ ప్రధాన కార్యదర్శి షాలినీ పండిత్

- రథయాత్ర ఏర్పాట్లపై ఆరోగ్యశాఖ కార్యదర్శి షాలినీ పండిట్ ఆరా
- అంటు రోగాలు ప్రబలకుండా కార్యాచరణ చేపట్టాలని ఆదేశం
- వడదెబ్బ చికిత్సకు ప్రత్యేక ఏర్పాట్లు, అంబులెన్సు సేవలు

భువనేశ్వర్: రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ ప్రధాన కార్యదర్శి షాలినీ పండిట్ బుధవారం పూరీ జగన్నాథాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా త్వరలో ప్రారంభం కానున్న రథయాత్రకు ముందు ఆరోగ్య సంరక్షణ మౌలిక సదుపాయాలు, సౌకర్యాలను ఆమె సమీక్షించారు. నవయవ్వన దర్శన్ నుంచి గుండిచా జాతర, బహుడా(మారు రథ యాత్ర) వరకు ఆరోగ్య సంరక్షణ సేవలను అందించేందుకు నిత్యం పూర్తి అప్రమత్తంగా ఉండాలని జిల్లా ప్రధాన వైద్యాధికారి(సీడీఎంఓ), ప్రజారోగ్యశాఖ అధికారులను ఆదేశించారు. అంబులెన్స్ సేవలు, వైద్యులు, వైద్య బృందాలు, పారా మెడికల్ సిబ్బంది, ఆహార భద్రత తనిఖీ బృందాల ఏర్పాటు, వివిధ అంటు వ్యాధుల చికిత్స తదితర అంశాలపై ఆమె చర్చించారు. సంక్షేమ సేవలు, కోవిడ్ నిర్వహణ, అత్యవసర సేవల కోసం వివిధ ఆస్పత్రుల్లో మరిన్ని పడకల ఏర్పాటు, వడదెబ్బ చికిత్స వ్యవస్థ తదితర విభాగాల మధ్య సమన్వయం గురించి వివరంగా చర్చించారు.

132 కేంద్రాల్లో..

ఈ ఏడాది పూరీ జిల్లా ఆస్పత్రులు, సమీప ఆస్పత్రుల్లో మరో 132 అత్యవసర పడకలు, వడదెబ్బ చికిత్స కోసం అదనంగా 82పడకలు ఏర్పాటు చేయాలని సమీక్ష సమావేశంలో నిర్ణయించారు. క్యాజువాలిటీ, ఎమర్జెన్సీ మెడికల్ యూనిట్లను పూర్తి స్థాయిలో సిద్ధంగా ఉంచాలని షాలినీ పండిట్ ఆదేశించారు. రథయాత్ర కొనసాగే బొడొదండొ మార్గంలో దారి పొడవునా పలుచోట్ల ప్రథమ చికిత్స కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు. దీంతో పాటు పలు ముఖ్యమైన ప్రదేశాల్లో 30 అంబులెన్స్‌లు సిద్ధంగా ఉంచుతారు. ఆహార భద్రత తనిఖీకి రెండు బృందాలను నియమించి ప్రత్యేక ఆరోగ్య అవగాహన కార్యక్రమం నిర్వహిస్ఇదిలా ఉండగా జిల్లా కేంద్ర ఆసుపత్రిలో 25 ఆక్సిజన్ పడకలు, ఆపరేషన్ థియేటర్, ఐసీయూలను పూర్తిస్థాయిలో సిద్ధం చేశారు. రథయాత్ర సందర్భంగా అంటువ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు ఆహార భద్రత, తాగునీటి వ్యవస్థపై తనిఖీలు పటిష్టం చేయాలని తెలిపారు. ఉత్సవాల సందర్భంగా జిల్లాలో వైద్యులు, పారా మెడికల్ సిబ్బంది కొరత లేకుండా చూడాలని ఆరోగ్యశాఖ డైరెక్టర్‌కు షాలినీ పండిట్ కోరారు.

240మంది..

రాష్ట్రం నుంచి 240మందికి పైగా వైద్య నిపుణులు, నర్సులు, ఫార్మసిస్టులు, ఇతర పారా మెడికల్ సిబ్బందిని పూరీకి పంపాలని ఆరోగ్యశాఖ కార్యదర్శి ఆదేశించారు. జిల్లాలోని ఆస్పత్రుల్లో అవసరమైన మొత్తంలో మందులను అందుబాటులో ఉంచుకోవాలని, వైద్య పరికరాల పనితీరును పునఃపరిశీలించాలని తెలిపారు. యాత్ర సందర్భంగా రోగుల సంరక్షణకు రవాణా చేసేందుకు జిల్లా యంత్రాంగం, అధికారులు, ఉద్యోగులకు పాస్‌లు జారీ చేస్తారు. ఈ పర్యటనలో భాగంగా ఆరోగ్యశాఖ కార్యదర్శి షాలినీ పండిట్ శ్రీ జగన్నాథ్ వైద్య బోధన ఆస్పత్రి(ఎస్‌జేఎంసీహెచ్) సందర్శించి రోగులతో సంభాషించారు. ఒడిశా మెడిసిన్ కార్పొరేషన్ లిమిటెడ్ డాక్టర్ పోమా టుడు, ఆరోగ్యశాఖ డైరెక్టర్ డాక్టర్ బిజయ్ మహాపాత్రొ, జిల్లా ఇన్‌చార్జి మేజిస్ట్రేట్ ప్రదీప్ సాహు, ఎస్‌జెఎంసీహెచ్ ప్రిన్సిపాల్, డీన్ డాక్టర్ మాయా పాఢి సహా సీనియర్ ఆరోగ్య అధికారులు చర్చల్లో పాల్గొన్నారు.



శ్రీ జగన్నాథ్ వైద్య బోధనాస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులతో మాట్లాడుతున్న దృశ్యం

దివ్యాంగులకు ప్రత్యేక దర్శనం

- తదనుగుణంగా ఏర్పాట్లు చేయాలి
- పూరీ పాలక మండలికి హైకోర్టు ఆదేశాలు



పూరీ జగన్నాథుడు

భువనేశ్వర్: శ్రీమందిరం రత్న వేదికపై కొలువు దీరిన సోదర, సోదరీసమేత జగన్నాథుని దివ్యాంగ భక్తులకు సులభ దర్శనం కల్పించాలని రాష్ట్ర హైకోర్టు ఆదేశించింది. ఈ మేరకు అనుబంధ వర్గాలకు నెల రోజుల గడువు కల్పించింది. ఆలయంలో జగన్నాథ స్వామిని దివ్యాంగులు సులభ దర్శనం కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక సౌకర్యాల సమగ్ర నివేదిక నిర్ధారిత గడువులోగా దాఖలు చేయాలని ఆలయ పాలకమండలి, పూరీ జిల్లా కలెక్టర్‌కు హైకోర్టు ఆదేశించడం విశేషం. గత ఏడాది డిసెంబర్‌లో విచారణ జరిపి, హైకోర్టు జారీ చేసిన ఉత్తర్వులను అనుబంధ వర్గాలు నిర్లక్ష్యం ప్రదర్శించాయి. సంబంధిత కేసును విచారించిన హైకోర్టు, నెల రోజుల్లోగా దివ్యాంగ భక్తుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని హైకోర్టు గతంలో ఆదేశించింది. అయితే ఇప్పటి వరకు ఎలాంటి ఏర్పాట్లు చేయకపోవడంతో పిటిషనర్ జితేంద్ర బిస్వాల్ కోర్టు ధిక్కరణ కేసు దాఖలు చేశారు. దరఖాస్తుదారు దివ్యాంగుడు కావడంతో అతను వీల్‌చైర్‌పై ఆధారపడతాడు. ఈ నేపథ్యంలో శారీరక దివ్యాంగ భక్తుల కోసం ఆలయ ఉత్తర ద్వారం నుంచి ఆనంద్‌బజార్ మీదుగా కీర్తన ప్రాంగణం మీదుగా గంట ద్వారం వరకు ర్యాంపు ఏర్పాటు చేయాలని దేవస్థానం నిర్ణయించింది. ఈ నిర్ణయం వాస్తవ కార్యాచరణ నోచుకోలేదు. అనుబంధ వర్గాల అలసత్వంతో ఈ పనులు పాక్షికంగా నిలిచిపోయాయి. ఈ ర్యాంపు మీదుగా వీల్‌చైర్లలో వెళ్లలేక దివ్యాంగ భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు శ్రీమందిరం ప్రాకారం ప్రాజెక్టు పనులు చకచకా జరుగుతున్నాయి. సాధారణ భక్తులకు సులభ దర్శనం, ఆలయ సందర్శన, ప్రదక్షిణ సౌకర్యాల ఏర్పాటు ఈ ప్రాజెక్టులో భాగంగా పనులు నిరవధికంగా కొనసాగిస్తున్నారు. దివ్యాంగ భక్తుల సౌకర్యాల పట్ల నిర్లక్ష్య వైఖరి విచారకరమని పిటిషనర్ ఆవేదన వ్యక్తం చేశారు. దివ్యాంగ భక్తులకు ర్యాంపులు ఏర్పాటు చేయకపోవడం ఏమిటో అంతుచిక్కడం లేదని హైకోర్టుకు విన్నవించారు.

గవర్నర్ షెడ్యూల్‌లో మార్పు

- 4రోజుల ముందుగానే హర్యానా నుంచి గణేషీలాల్ రాక
- మంత్రిమండలి పునర్వ్యవస్థీకరణ ఊహాగానాలు



గవర్నర్ గణేషీలాల్

భువనేశ్వర్: రాష్ట్ర గవర్నర్ ప్రొఫెసర్ గణేషీలాల్ స్వరాష్ట్ర పర్యటన కార్యక్రమంలో ఆకస్మిక మార్పు చోటు చేసుకుంది. ముందస్తు షెడ్యూలు కంటే ముందుగానే ఆయన ఒడిశాకు తిరిగి వస్తున్నారు. షెడ్యూల్ ప్రకారం ఈనెల 22 వరకు గవర్నర్ స్వస్థలమైన హర్యానా పర్యటనలో ఉంటారని రాజ్ భవన్ వర్గాలు పేర్కొన్నాయి. అయితే 4రోజుల ముందుగానే బుధవారం రాత్రి 8 గంటలకు భువనేశ్వర్ చేరుకోవడం చర్చనీయాంశమైంది. పూరీ నుంచి వందేభారత్ ఎక్స్‌ప్రెస్ ఫ్లాగ్‌ఆఫ్ కార్యక్రమం హాజరు కావడానికి ఆయన తిరిగి వస్తున్నట్లు అధికారిక వర్గాలు ప్రకటిస్తున్నా.. రాజకీయ శిబిరాల్లో భిన్నమైన చర్చ కొనసాగుతోంది. ఇలా ఒక్కసారిగా పర్యటన షెడ్యూల్ మారడం చర్చకు ఆజ్యం పోసింది. పూరీ రైల్వే స్టేషన్‌లో వందేభారత్ సెమీ హైస్పీడ్ రైలు ప్రారంభోత్సవం ముగియడంతో ఆయన తిరిగి హర్యానా వెళ్తారని మరోవర్గం ప్రచారం చేస్తోంది. కేబినెట్ పునర్‌వ్యవస్థీకరణ నేపథ్యంలో గవర్నర్ స్వస్థల పర్యటన ముందస్తుగా ముగించుకుని తిరిగి వచ్చినట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. మరోవైపు ఇటీవల దుబాయ్ పర్యటనకు వెళ్లిన కొందరు అధికార పార్టీ నేతలు బుధవారం సాయంత్రానికి ముందస్తుగా తిరిగి వస్తున్నట్లు సమాచారం. మంత్రి పదవి ఆశావహులు హడావిడిగా తిరిగి వస్తున్నారు. దీంతో ఏ క్షణంలోనైనా రాజకీయంగా పెనుదుమారం రేగవచ్చని అంతా భావిస్తున్నారు. అయితే మంత్రివర్గం పునర్వ్యవస్థీకరణ, ప్రమాణ స్వీకారానికి సంబంధించి రాజ్‌భవన్ నుంచి స్పష్టమైన సమాచారం లేదు.

5టీ పనుల్లో అక్రమాలు



విజిలెన్స్ ఎస్పీకి ఫిర్యాదు చేస్తున్న రవీంద్ర మహాపాత్ర

- విజిలెన్స్ ఎస్పీకి ఫిర్యాదు చేసిన బీఆర్ఎస్ నాయకుడు

జయపురం: స్థానిక పట్టణంలో చేపట్టిన 5టీ పథకం పనుల్లో అవినీతి, అక్రమాలు చోటు చేసుకున్నాయని కొరాపుట్ జిల్లా యూత్ ఆర్గనైజేషన్ సభ్యులు ఆరోపించారు. ఈ మేరకు సంఘం కన్వీనర్, బీఆర్ఎస్ నాయకుడు రవీంద్ర మహాపాత్ర జిల్లా విజిలెన్స్ ఎస్పీని బుధవారం కలిసి, ఫిర్యాదు చేశారు. రాష్ట్రప్రభుత్వం 5టీ పథకంలో భాగంగా పాఠశాలల ఉన్నతికి కృషి చేస్తోందని గుర్తుచేశారు. అయితే జయపురం బాలికోన్నత పాఠశాలలో 5టీ ఆధునికీకరణ పనులలో నిధుల దుర్వినియోగం జరుగుతోందన్నారు. పనులను 30 భాగాలుగా విభజించి, ఒక్కో భాగానికి రూ.3 లక్షలు అంచనాగా రూపొందించారని తెలిపారు. అయితే ఒకే పనిని 30 భాగాలుగా విభజించడం పలు అనుమానాలకు తావిస్తోందన్నారు. ప్రభుత్వ చట్టం 13220-పీఆర్ డీడబ్ల్యూ 13.7.2018 ప్రకారం మున్సిపాలిటీ పరిధిలో చేపట్టే రూ.3 లక్షల లోపు పనులకు టెండర్లు పిలవాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. దీనిని ఆసరాగా చేసుకొని, రూ.90 లక్షల విలువైన పనులకు టెండర్లు పిలవకుండా ఉద్దేశ పూర్వకంగా 30 భాగాలు చేశారని విమర్శించారు. వివరాలు పరిశీలిస్తే పనులన్నీ ఒకేసారి ప్రారంభమై, అన్నిటికీ ఒకేసారి బిల్లులు చెల్లించారని ఎత్తిచూపారు. అక్రమాలపై ప్రసార మాధ్యమాల్లో కథనాలు రావడంతో పాఠశాల ఉపాధ్యాయులు పనుల నాణ్యతను పరిశీలించి, అసంతృప్తి వ్యక్తం చేశారన్నారు. అయితే సిబ్బందిపై కొందరు బెదిరింపులకు పాల్పడుతున్నారని ఎస్పీ దృష్టికి తీసుకు వచ్చారు. వీటిపై సమగ్ర దర్యాప్తు చేపట్టి, బాధ్యులపై చర్యలు తీసుకోవడంతో పాటు ప్రభుత్వ నిధులు సద్వినియోగం అయ్యేలా కృషి చేయాలని విన్నవించారు.

సెంచూరియన్‌లో రైతుల సమావేశం నేడు

పర్లాకిమిడి: సెంచూరియన్ వర్సిటీ క్యాంపస్ ఆడిటోరియంలో గురువారం ఉదయం వ్యవసాయ ఆధునిక పనిముట్లు, అవగాహనపై రైతులతో సమావేశం నిర్వహించనున్నట్లు రిజిస్ట్రార్ డాక్టర్ అనితా పాత్రొ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. రైతులు ఎదుర్కొంటున్న వాతావరణ సమస్యలు, డ్రోన్ల వినియోగంపై సదస్సు చర్చించనున్నట్లు పేర్కొన్నారు. రైతులు అధిక సంఖ్యలో పాల్గొని, విజయవంతం చేయాలని కోరారు.

సేవా దృక్పథం తప్పనిసరి

- రాజ్యసభ మాజీ ఎంపీ నెక్కంటి పిలుపు



కార్యక్రమంలో పాల్గొన్న అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు



ప్రసంగిస్తున్న మాజీ ఎంపీ నెక్కంటి భాస్కరరావు

రాయగడ: ప్రతిక్కరూ సేవా దృక్పథాన్ని అలవర్చుకోవాలని రాజ్యసభ మాజీ ఎంపీ నెక్కంటి భాస్కరరావు సూచించారు. స్థానిక సమితి కార్యాలయంలో కిట్(కళింగ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ) ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన ఆర్ట్ ఆఫ్ గివింగ్ సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సమాజ సేవకుడు కిట్, కిస్ విద్యాసంస్థల వ్యవస్థాపకుడు డాక్టర్ అచ్యుత్ సామంత ఎంతోమంది పేద, ఆదివాసీ విద్యార్థులకు ఉచితంగా విద్య అందిస్తున్నారని గుర్తుచేశారు. అటువంటి సేవాభావం గల వ్యక్తులు చాలా అరుదుగా ఉంటారని కొనియాడారు. ఈ సంస్థలో విద్య అభ్యసించిన ఎంతోమంది ఆదివాసీ విద్యార్థులు అంతర్జాతీయ వేదికలపై సైతం సత్తా చాటారని అభినందించారు. ఉన్నత స్థానంలో నిలిచిన వారంతా సేవభావంతో ముందుకు సాగి, మరింత మందికి తమకు తోచిన సాయం అందించాలని హితవు పలికారు. కార్యక్రమ నిర్వాహకుడు హరప్రసాద్ హెప్రుక మాట్లాడుతూ అచ్యుత్‌సామంత నేతృత్వంలో ఎంతోమంది ఉన్నత విద్య పొందుతున్నారని తెలిపారు. భువనేశ్వర్‌లోని కిట్, కిస్ విద్యాసంస్థలో సుమారు 3వేల మంది ఉచితంగా విద్య అభ్యసిస్తున్నారన్నారు. వారికి ఆశ్రయం, భోజనం, అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన వసతులు అందిస్తున్నారని వివరించారు. కార్యక్రమంలో గౌరవ అతిథిగా పబ్లిక్ హెల్త్ ఏడీఎం డాక్టర్ మమత ఛౌదరి, డీఎస్పీ(డీఐబీ) సుధాం మల్లిక్) తదితరులు ప్రసంగించారు. ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం వారి సేవలను ప్రశంసిస్తూ.. కిట్ సభ్యు లు అభినందించి బహుమతులను అందజేశారు.

విద్యా ప్రమాణాలు మెరుగు పరచాలి



బీడీఓకు వినతిపత్రం అందిస్తున్న సర్పంచ్ జయంతి, గ్రామస్తులు

- కుంద్రా సమితి ప్రజాప్రతినిధుల వినతి

జయపురం: తమ గ్రామాల్లోని పాఠశాలలో విద్యార్థులకు వసతిగృహం, ఉన్నత తరగతులు ఏర్పాటు చేయాలని ప్రజాప్రతినిధులు, స్థానికులు కోరారు. ఈ మేరకు జయపురం సబ్ డివిజన్ కుంద్రా సమితి ఉదలబెడ, కదమబెడ పంచాయతీలకు చెందిన నాయకులు కొరాపుట్ జిల్లా విద్యాశాఖాధికారి రామచంద్ర నాయక్, జిల్లా సంక్షేమ విభాగ అధికారి, బ్లాక్ ఎడ్యుకేషన్ అధికారికి వినతిపత్రాలు బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా అసన సర్పంచ్ జయంతి కుశపారియ మాట్లాడుతూ ఉదలగుడ గ్రామంలోని ఉన్నత పాఠశాలలో 485మంది విద్య అభ్యసిస్తున్నారని, వారిలో ఆదివాసీ సంప్రదాయ విద్యార్థులు 245మంది, దళితులు 62మంది ఉన్నారని తెలిపారు. కదమబెడ గ్రామంలోని పాఠశాలలో 42మంది బాల, బాలికలు చదువుతున్నారని పేర్కొన్నారు. సమితిలోని అసన, పూల్‌బట, కర్మెటీ పంచాయతీలో కేవలం ఉదలగుడ గ్రామంలో మాత్రం ఉన్నత పాఠశాల ఉందన్నారు. అయితే హాస్టల్, ప్రయాణ సౌకర్యం లేకపోవడంతో ఎంతోమంది అర్ధాంతరంగా చదువులకు స్వస్తి పలుకుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిని దృష్టిలో పెట్టుకొని విద్యార్థులకు విద్యార్థులకు వసతి సౌకర్యం కల్పించాలని కోరారు. అలాగే ఉదలబెడ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు అధిక సంఖ్యలో ఉన్నందున ప్రత్యమ్నాయంగా కదమబెడ పాఠశాలలో 8వరకు తరగతులు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సమితి సభ్యులు గౌరీ హరిజన్, ధపసాయి మాఝి, తులసీరాం గొఢ, లచ్చణ ఖీలో, ప్రహ్లాద బారిక్, రాంసింగ్ గొడ, మోతీరాం నాయక్, పద్మ శాంత, లైసెన్స్ శాంత, గురుబంధు మాఝి, సురేందు సాగరియ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రానికి తాళం

- 2నెలలుగా సిబ్బంది రావడం లేదన్న సెమిలిఅటాల్ గ్రామస్తులు



కేంద్రానికి తాళాలు వేసి, నిరసన వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు

జయపురం: 'అంగన్‌వాడీ కేంద్రంలో ఎప్పుడూ వర్కర్లు ఉండరు. పిల్లలకు సరైన పౌష్టిక ఆహారం అందించడం లేదు. దీనిపై సంబంధిత అధికారులకు ఎన్నిమార్లు చెప్పినా పట్టించుకోవడం లేదు. అందుకే కేంద్రానికి తాళాలు వేశా'మని బొయిపరిగుడ సమితి గుప్తేశ్వర పంచాయతీ సెమిలిఅటాల్ గ్రామస్తులు తెలిపారు. గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రానికి స్థానికులు మంగళవారం ఉదయం తాళాలు వేసి, నిరసన వ్యక్తం చేశారు. అధికారులు లిఖిత పూర్వకంగా హామీ ఇచ్చేంత వరకు ఆందోళన కొనసాగిస్తామని స్పష్టంచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత 2నెలలుగా అంగన్‌వాడీ వర్కర్లు కేంద్రానికి సక్రమంగా రావడం లేదని, దీనివల్ల చిన్నారులు ప్రాథమిక విద్య, వైద్య, పౌష్టికాహారానికి దూరం అవుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. గర్భిణులకు సైతం ప్రభుత్వం నుంచి వచ్చే సౌకర్యాలు అందడం లేదని వాపోయారు. సిబ్బంది ఇదే గ్రామంలో నివసిస్తున్నా.. ఎందుకు సకాలంలో రావడం లేదో తెలియదన్నారు. ఈ విషయమై సీడీపీఓకు ఫిర్యాదు చేసినా ఎటువంటి చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. సిబ్బందితో పాటు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్, సంబంధిత అధికారుల బాధ్యతారాహిత్యం కారణంగానే ఈ పరిస్థితి తలెత్తిందని విమర్శించారు. అధికారులు లిఖిత పూర్వకంగా హామీ ఇవ్వడంతో పాటు చిన్నారుల పౌష్టిరాహారం పంపిణీని ప్రారంభించే వరకు తాళాలు తీసేది లేదన్నారు.

చర్చలు విఫలం..

సెమిలిఅటాల్ గ్రామస్తులు అంగన్‌వాడీ కేంద్రానికి తాళాలు వేసిన ఘటనను తెలుసుకున్న సీడీపీఓ జి.సీతాకుమారి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు బుధవారం ఆ గ్రామాన్ని సందర్శించారు. నిరసన వ్యక్తం చేస్తున్న ప్రజలతో చర్చలు జరిపారు. అయితే తమ డిమాండ్లు పరిష్కరించే వరకు తాళాలు తీయమని భీష్మించడంతో అధికారులు, సిబ్బంది వెనుదిరిగారు. మరోసారి వస్తామని, ఆలోచించి, నిర్ణయం తీసుకోవాలని సూచించారు. సమావేశంలో అంగన్‌వాడీ వర్కర్, సూపర్‌వైజర్లు, మహిళలు పాల్గొన్నారు.



గ్రామస్తులతో చర్చిస్తున్న సీడీపీఓ సీతాకుమారి

క్లుప్తంగా

వైన్‌షాప్‌లో కల్తీ మద్యం పట్టివేత

● సూపర్‌వైజర్, సేల్స్‌మెన్లపై కేసు నమోదు

పాతపట్నం: నీళ్ల కలిపి అక్రమంగా మద్యం అమ్మకాలు చేపడుతున్న వైన్‌షాపుపై బుధవారం సాయంత్రం ఎక్సైజ్,విజిలెన్స్ సీఐ ఎం.రాజేష్‌కుమార్ బృందంతో దాడులు నిర్వహించారు. మండలంలోని తెంబూరు గ్రామ సమీపంలో ఉన్న వైన్‌షాపులో కొద్ది రోజులుగా మద్యం బాటిళ్లలో నీరు కల్తీ చేస్తున్నట్లు విజిలెన్స్ అధికారులకు సమాచారం వచ్చింది. దీంతో దాడులు చేసి షాపును తనిఖీ చేశారు. ఎంహెచ్ 25 ఫుల్ బ్యాటిళ్లు, ఎనిమిది పీఎం 20 ఫుల్ బ్యాటిళ్లలో నీళ్లు కలిపి అమ్ముతున్నట్లు గుర్తించారు. దీంతో సూపర్‌వైజర్ ఉమా, సెల్స్‌మెన్ బాలకృష్ణలపై కేసునమోదు చేశామని సీఐ రాజేష్‌కుమార్ తెలిపారు. దాడుల్లో ఎస్‌ఐ బి.శ్రీరామూర్తి, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

వాహనం బోల్తా



బోల్తాపడిన బొలేరో వాహనం

కోటబొమ్మాళి: పొడుగుపాడు వద్ద జాతీయ రహదారిపై బొలేరో వాహనం బుధవారం బోల్తా పడింది. అయితే ప్రాణనష్టం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. వివరాల్లోకి వెళ్తే శ్రీకాకుళం నుంచి టెక్కలి మండలం సాకిపల్లి కొత్తూరుకు ఉల్లిపాయల లోడుతో వెళ్తున్న వాహనం పొడుగుపాడు వద్దకు వచ్చేసరికి వెనుక టైర్ పక్చర్ కావడంతో అదుపుతప్పి బోల్తా పడింది. అదే సమయంలో వెనుక వస్తున్న రెండు లారీల డ్రైవర్లు ప్రమాదాన్ని గమనించి సడన్ బ్రేకులు వేయడంతో పెను ప్రమాదం తప్పింది. ఈఘటనలో బొలేరో డ్రైవర్ వంగ సింహాచలం స్వల్ప గాయాలతో బయటపడ్డారు. వాహనం బోల్తాతోపాటు అందులోనున్న ఉల్లిపాయలు, ఇతర సామగ్రి చెల్లాచెదురుగా రోడ్డుకు అడ్డంగా పడ్డంతో కాసేపు ట్రాఫిక్ నిలిచిపోయింది. ఎన్‌హెచ్-16 పెట్రోలింగ్ పోలీసులు సంఘటనా స్థలానికిచేరి ట్రాఫిక్‌ను నియంత్రించారు.

పారిశ్రామికవేత్తలుగా మహిళలు



మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ విద్యాసాగర్

ఎచ్చెర్ల క్యాంపస్: స్వయం సహాయక సంఘాల మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడం లక్ష్యంగా పలు పథకాలు అమలు చేస్తున్నామని జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ డాక్టర్ డి.వి.విద్యాసాగర్ అన్నారు. ఎచ్చెర్ల సాంకేతిక శిక్షణ కేంద్రంలో బుధవారం రాష్ట్ర పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో 'ఉమెన్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్' అనే అంశంపై రెండు రోజుల శిక్షణ ప్రారంభించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ ప్రతి సంఘంలో ఒకరు గానీ, ఇద్దరు ముగ్గురు గానీ కలిసి చిన్న పరిశ్రమల యూనిట్ల ఏర్పాటుకు ముందుకొస్తే ప్రోత్సాహం అందిస్తామని చెప్పారు. ఈ ఏడాది మహిళల ఆధ్వర్యంలో 750 వ్యాపార యూనిట్లు నిర్వహణ లక్ష్యంగా నిర్దేశించినట్లు వివరించారు. బ్యాంకులు సైతం రూ.2 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు ఎటువంటి హామీ లేకుండా రుణాలు అందజేస్తున్నాయని తెలిపారు. ఔత్సాహిక మహిళలను గుర్తించి బ్యాంకు రుణాలు ఇప్పించి పరిశ్రమల ఏర్పాటుకు ముందుకు వచ్చేలా అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో వెలుగు అధికారులు, బ్యాంకుల ప్రతినిధులు పాల్గొన్నారు.

చల్లని సమయాల్లో 'ఉపాధి'



పనులు పరిశీలిస్తున్న డ్వామా పీడీ చిట్టిరాజు

శ్రీకాకుళం రూరల్: ఉపాధి వేతనదారులు ఉదయం, సాయంత్రపు వేళల్లో పనికి హాజరై కనీసం ఆరు గంటల పాటు శ్రమిస్తే కూలి గిట్టుబాటు అవుతుందని జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ జి.వి.చిట్టిరాజు అన్నారు. బుధవారం బలివాడ, ఇప్పిలి పరిసర ప్రాంతాల్లో జరుగుతున్న ఉపాధి పనులకు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాబ్‌కార్డు ఉన్న ప్రతిఒక్కరూ పనికి రావాలన్నారు. పని ప్రదేశాల్లో ప్రథమ చికిత్స పెట్టెలు అందుబాటులో ఉంచాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఏపీఓ సీతారాం, సర్పంచ్ లోలుగు శ్రీనివాసరావు, ఎంపీటీసీ బాబు పాల్గొన్నారు.

ఇంటి వద్దే నమోదు చేయాలి

● వెనుకబడిన వర్గాల సర్వేపై బీసీ మోర్చా డిమాండ్

జయపురం: షెడ్యూల్ కులాలు, వెనుకబడిన వర్గాల వారి సర్వేను ప్రతి ఇంటికి వెళ్లి నమోదు చేయాలని జాతీయ వెనుకబడిన వర్గ మోర్చా కొరాపుట్ జిల్లాశాఖ డిమాండ్ చేసింది. ఈ మేరకు రాష్ట్ర గవర్నర్‌ను ఉద్దేశించిన వినతిపత్రాన్ని జిల్లా అదనపు కలెక్టర్ రాజేంద్ర మాఝికి బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా మోర్చ జిల్లా అధ్యక్షుడు మదనమోహన నాయక్, కార్యదర్శి పరమేశ్వర పాత్రో, రాష్ట్ర కార్యదర్శి చంద్రకాంత సుతార్, ఉపాధ్యక్షుడు రాజేంద్రకుమార్ గౌఢ మాట్లాడారు. రాష్ట్రంలోని ఎస్టీ, బీసీల స్థితిగతులపై చేపడుతున్న సర్వే సక్రమంగా లేదన్నారు. ప్రతి కుటుంబంలోని ప్రధాన వ్యక్తి నేరుగా సర్వే కేంద్రానికి వెళ్లి, వివరాలు అందిస్తేనే అధికారులు జాబితాలో నమోదు చేస్తున్నారని తెలిపారు. నిరక్షరాస్యులు, మారుమూల ప్రాంతాల్లో ప్రజలకు పూర్తిస్థాయిలో చైతన్యం లేకపోవడంతో అంతా సర్వేలో నమోదు చేసుకోలేక పోతున్నారని అభిప్రాయం వ్యక్తంచేశారు. దీనివల్ల సర్వేతో పాటు ప్రభుత్వ లక్ష్యాలు అసంపూర్తిగా మిగిలి పోతాయన్నారు. రాష్ట్ర గవర్నర్ గణేషీలాల్, ఉన్నాతాధికారులు దీనిపై దృష్టి సారించి, వెనుకబడిన వర్గాల ప్రయోజనాలే లక్ష్యంగా వారి ఇళ్ల వద్దకే వెళ్లి, వివరాలు నమోదు చేయాలని కోరారు. అలాగే బాబితాలో కుటుంబంలోని ప్రతి వ్యక్తి విద్య, ఉద్యోగ, రాజకీయ వివరాలకు స్థానం కల్పించాలని విన్నవించారు. కార్యక్రమంలో మోర్చా నాయకులు ఎ.గుప్తేశ్వరరావు, శరత్ గౌఢ, సంజయకుమార్ ఝూ, బాలారాయ్ తదితరులు పాల్గొన్నారు.



ఏడీఎంకు వినతిపత్రం అదిస్తున్న మోర్చా నాయకులు

1.19లక్షల మంది నమోదు..

రాయగడ: వెనుకబడిన కులాల జాబితా నమోదు ప్రక్రియలో భాగంగా జిల్లాలో 35,636 మంది కుటుంబాలకు చెందిన 1.19 లక్షల మంది నమోదైనట్లు అధికారులు ప్రకటించారు. రాష్ట్ర విద్యాశాఖ కార్యదర్శి, వెనుకబడిన కులాల సంక్షేమశాఖ జిల్లా పరిశీలకులు వీరేంద్ర కొరకొరియా బుధవారం జిల్లా కేంద్రంలో పర్యటించారు. ఈ మేరకు కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో అధికారులతో సమావేశమైన ఆయన.. నమోదు ప్రక్రియకు సంబంధించి సంబంధితశాఖ అధికారుల నుంచి వివరాలను అడిగి తెలుసుకున్నారు. జిల్లా అదనపు మేజిస్ట్రేట్ ధర్మానంద బెహరా, రాయగడ బీడీఓ లక్ష్మీనారాయణ సాబొతొ, జిల్లా నొడల్ అధికారి శ్రీకాంత్ పాణిగ్రహి ఈ మేరకు నమోదు ప్రక్రియ వివరాలను తెలియజేశారు. ఈనెల 20తో పూర్తి కానున్న నమోదులో మరి కొంతమంది నమోదయ్యే అవకాశం ఉందని వివరించారు. ఏవరైనా ఈ జాబితాలో పేర్లు నమోదు చేసుకోలేకపోతే.. అటువంటి వారిని గుర్తించి, మే 21 నుంచి 27వరకు నమోదు చేసేందుకు అవకాశం కల్పిస్తున్నట్లు ప్రకటించారు. అనంతరం తుది నివేదికను ప్రభుత్వానికి తెలియజేయాలని ఆదేశించారు. అంతకుముందు ఆయన రాయగడ సమితి పరిధిలోని హులువ, గుమ్మ, కుంభికొట తదితర పంచాయతీల్లో పర్యటించి, నమోదు ప్రక్రియ కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు.



అధికారులతో మాట్లాడుతున్న కొరకొరియా, పక్కన ఏడీఎం ప్రధాన్

ఎండలు బాబోయ్.. ఎండలు



● 15 జిల్లాల్లో 42 డిగ్రీలకు పైగా గరిష్ట ఉష్ణోగ్రత నమోదు

భువనేశ్వర్: రాష్ట్రంలో ఎండలు భయంకరంగా వేధిస్తున్నాయి. ఉదయం పూట గడప దాటేందుకు భయపడే పరిస్థితులు తాండవిస్తున్నాయి. బుధవారం 15 జిల్లాల్లో గరిష్ట ఉష్ణోగ్రత 42 డిగ్రీల సెల్సియస్‌కు పైగా నమోదైంది. సోన్‌పూర్, అంగుల్‌లో అత్యధికంగా 44.1 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రత రికార్డయ్యింది. 44 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రతతో బౌధ్ తదుపరి స్థానంలో నిలిచింది.

రాష్ట్రవ్యాప్తంగా నమోదైన ఉష్ణోగ్రత వివరాలు

ప్రాంతం	గరిష్ట ఉష్ణోగ్రత (డిగ్రీల సెల్సియస్)
సోన్‌పూర్	44.1
అంగుల్	44.1
బౌధ్	44.0
టిట్లాగడ్	43.5
సంబల్‌పూర్	43.4
ఝూర్సుగుడ	43.4
భవానీపట్న	
హీరాకుడ్	42.9
మల్కన్‌గిరి	42.6
బొలంగీర్	42.5
తాల్చేరు	42.4
రౌర్కెలా	42.2
నువాపడా	42.0
సుందరగడ్	42.0
బర్‌గడ్	42.0
బరిపద	41.2
భద్రక్	41.0
ఫుల్బాణి	41.0
దేవ్‌గడ్	40.5
కెంజొహర్	40.4
కేంద్రాపడా	40.0
చాంద్‌బాలి	40.0

గురి తప్పొద్దు..



విలువిద్యలో గురి పెడుతున్న గిరిజనులు

● బొండా ఘాటీలో గిరిజనులకు విలువిద్య పోటీలు

మల్కన్‌గిరి: జిల్లా ఖొయిర్‌పుట్ సమితి బొండా ఘాటీ ఆండ్రహల్‌లో ఉన్న బీఎస్‌ఎఫ్ 65 బెటాలియన్ ఆధ్వర్యంలో బోండా గిరిజనులకు బుధవారం విలువిద్య పోటీలు నిర్వహించారు. పోటీలో సత్తాచాటిన యువకులకు రానున్న రోజుల్లో అంతరాష్ట్ర పోటీలకు పంపిస్తామని బీఎస్‌ఎఫ్ కొరాపుట్ డీఐజీ సైల్స్ కుమార్ తెలిపారు. కమాండర్ టీఎన్‌ఎస్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ శిబిరంలో 16 గ్రామాలకు చెందిన వందలాది మంది యువకులు పాల్గొని, సత్తాచాటారు. అనంతరం సామూహిక భోజనాలు జరిపారు. అలాగే గ్రామస్తులకు బీఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో దుస్తులు, నిత్యావసర సరుకులు, ఆట వస్తువులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో భాగంగా బొండా గిరిజనులు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.



హాజరైన గిరిజనులతో బీఎస్‌ఎఫ్ అధికారులు

భవనంపై నుంచి పడి యువకుడి మృతి



మృతిచెందిన యువకుడు విజ్జు

ఎంవీపీకాలనీ: మద్యం మత్తులో భవనంపై నుంచి జారిపడి యువకుడు మృతి చెందాడు. ఎంవీపీ పోలీసులు తెలిపిన వివరాలివీ.. ఒడిశాకు చెందిన విజ్జు(26) నగరంలోని ఓ హోటల్‌లో వంట మనిషిగా పనిచేస్తున్నాడు. అదే రాష్ట్రానికి చెందిన పలువురు యువకులతో కలిసి ఎంవీపీకాలనీ సెక్టార్-9లోని ఓ ఇంట్లోని రెండో అంతస్తులో అద్దెకు ఉంటున్నాడు. మంగళవారం పనికి వెళ్లని యువకుడు.. మధ్యాహ్నం నుంచి మద్యం తాగుతూ ఉన్నాడు. మంగళవారం అర్ధరాత్రి మద్యం మత్తులో బయటకు వచ్చిన అతను.. అదుపు తప్పి రెండో అంతస్తు నుంచి కింద పడిపోయాడు. ఈ ఘటనలో తలకు తీవ్రగాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. విషయంపై తోటి యువకులు సమాచారం అందించడంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. ఎస్‌ఐ సింహాచలం కేసు దర్యాప్తు చేస్తున్నారు.

యాక్షన్ మోడ్..



ఝూర్సుగుడ మున్సిపల్ అధికారులతో ఎమ్మెల్యే సమావేశం

భువనేశ్వర్: ఝార్సుగుడ నియోజకవర్గ ఎమ్మెల్యేగా ఎన్నికైన దీపాలీ దాస్ చురుగ్గా కార్యక్షేత్రం లోకి దిగారు. ఝార్సుగుడ మున్సిపల్ కౌన్సిల్ కార్యాలయాన్ని బుధవారం సందర్శించిన ఆమె.. పలు పట్టణాభివృద్ధి కార్యక్రమాలను ప్రత్యక్షంగా సమీక్షించారు. మున్సిపల్ కౌన్సిల్ కార్యనిర్వహణ అధికారి, పట్టణ చైర్‌పర్సన్ రాణి హతి, ఉపాధ్యక్షుడు వేణు గోపాల్ పాణిగ్రాహి ఆమెకు స్వాగతం పలికారు. అనంతరం మున్సిపల్ కౌన్సిల్ హాలులో జరిగిన సమీక్షా సమావేశానికి హాజరయ్యారు. పట్టణ ప్రాంతాల్లో విద్యుత్ దీపాల ఏర్పాటు, రోడ్ల నిర్మాణానికి ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులకు సూచించారు. ఝార్సుగుడ పురపాలక సంఘం చైర్మన్, డిప్యూటీ చైర్మన్ సమక్షంలో జిల్లాకు చెందిన అధికారులందరితో మున్సిపాలిటీ అభివృద్ధి పనులపై చర్చించారు. అసంపూర్తిగా ఉన్న ప్రాజెక్టులను వెంటనే పూర్తి చేయాలని, పారిశుధ్యం, ఇతర అభివృద్ధి పనులు కొనసాగించాలని సూచించారు.



అభివృద్ధి పనులపై జిల్లా అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే దీపాలీ దాస్

తండ్రికి తలకొరివి పెట్టిన తనయ

లావేరు: పెదలింగాలవలస గ్రామానికి చెందిన వండాన అశిరయ్య అనారోగ్యంతో బుధవారం మృతి చెందారు. ఆయనకు కుమారులు లేరు. దీంతో కుమార్తె పండమ్మ తండ్రి మృతదేహానికి తలకొరివి పెట్టి చితికి నిప్పు అంటించి అంత్యక్రియలు పూర్తిచేశారు. కన్నతండ్రి రుణం ఈ విధంగా తీర్చుకోవడంపై స్థానికులు ఆమెను అభినందించారు. ఏఎంసీ మాజీ డైరెక్టరు, గ్రామపెద్ద లుకలాపు అప్పలనాయుడుతో పాటు గ్రామస్తులు దగ్గరుండీ పండమ్మకు సహకరించి అశిరయ్య మృతదేహానికి దహన సంస్కారాలు చేయించారు.



తలకొరివి పెడుతున్న పండమ్మ

రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఎస్పీ తనిఖీలు

శ్రీకాకుళం రూరల్: శ్రీకాకుళం రూరల్ పోలీస్‌స్టేషన్‌ను జిల్లా ఎస్పీ జి.ఆర్.రాధిక బుధవారం సందర్శించారు. వార్షిక తనీఖీల్లో భాగంగా ప్రధానమైన కేసుల రికార్డులను పరిశీలించారు. ముఖ్యమైన కేసుల గురించి ఆరా తీశారు. స్టేషన్‌ను పరిశుభ్రంగా ఉంచాలని, ఫిర్యాదుదారుల పట్ల గౌరవంగా మెలగాలని సిబ్బందికి సూచించారు. నేర నియంత్రణకు పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. యువత మేలు కోరే విధంగా ప్రతిష్టాత్మకంగా రూపొందిన జాగృతి కార్యక్రమంలో భాగమైన పోలీసు విధులు, చట్టాలు, శిక్షలు, చెడు వ్యసనాలకు అలవాటు పడడం వల్ల కలిగే అనర్థాలపై విద్యార్థులు, యువతకు అవగాహన కల్పించాలన్నారు. దిశ యాప్‌ను యువతీ యువకుల మొబైల్స్‌లో డౌన్‌లోడ్ చేసేవిధంగా ప్రతీ పోలీసు పూనుకోవాలన్నారు. కార్యక్రమంలో శ్రీకాకుళం టౌన్ డీఎస్పీ వై శృతి, టౌన్ సీఐ సన్యాసినాయుడు, రూరల్ ఎస్సై విజయ్‌కుమార్ పాల్గొన్నారు.



రికార్డులు పరిశీలిస్తున్న ఎస్పీ రాధిక

అడవిపంది మాంసం విక్రయిస్తున్న ఇద్దరిపై కేసు నమోదు

పాతపట్నం: కొదూరు గ్రామంలో అడవి పందిని చంపి మాంసాన్ని వాటాలుగా విక్రయిస్తున్న ఇద్దరిని అటవీశాఖ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. వీరిపై కేసు నమోదు చేశామని ఫారెస్ట్ సెక్షన్ అధికారి యసస్వీ తెలిపారు. కొదురు గ్రామంలోని పంచాయతీ కార్యాలయం పక్కన రెకుల షెడ్‌లో బుధవారం ఉదయం ఎనిమిది గంటలకు అడవి పందిని చంపినట్టు సమాచారం అందుకున్న అటవీశాఖ సిబ్బంది అక్కడకు చేరుకున్నారు. గ్రామానికి చెందిన డి.చిన్నారావు, జి.సింహాచలం అడవిపంది మాంసం వద్ద ఉండడంతో వారిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశామన్నారు. వారిని గురువారం రిమాండ్‌కు తరలిస్తామని ఎఫ్ఎస్‌వో తెలిపారు. దాడుల్లో ఎఫ్‌బీవో ఉమామహేశ్వరరావు, సిబ్బంది ఉన్నారు.



అడవిపంది మాంసంతో పట్టుబడిన నిందితులు, పక్కనే అటవీ సిబ్బంది

ప్రపంచ శాంతికి మార్గదర్శకుడు గాంధీ

శ్రీకాకుళం అర్బన్: ప్రపంచశాంతికి మార్గదర్శకత్వం వహించిన మహనీయుల్లో మహాత్మాగాంధీ ముందంజలో ఉంటారని తమిళనాడు రాష్ట్రానికి చెందిన శంకరాచార్య సంస్కృత విశ్వవిద్యాలయం మాజీ వైస్ చాన్సలర్, కేరళ గాంధీదర్శన్ వేది చైర్మన్ ప్రొఫెసర్ ఎం.సి.దిలీప్‌కుమార్ అన్నారు. జిల్లా పర్యటనకు విచ్చేసిన ఆయన నగరంలోని శాంతినగర్ కాలనీలో ఉన్న మహాత్మాగాంధీ మందిరాన్ని బుధవారం సందర్శించారు. స్వాతంత్ర్య సమరయోధులు, జాతీయోద్యమ నేతలు, సంఘ సంస్కర్తల విగ్రహాలను తిలకించారు. దేశ స్వాతంత్ర్య భావజాలాన్ని నేటితరానికి అందించే ప్రయత్నం అభినందనీయమని నిర్వాహకులను ప్రశంసించారు. అన్నామలై యూనివర్శిటీ మాజీ ప్రొఫెసర్ సుందరమూర్తి పెరుమాళ్ మాట్లాడుతూ గాంధీ విధానాలు ప్రపంచానికే ఆదర్శప్రాయమన్నారు. కార్యక్రమంలో మందిర కమిటీ ప్రతినిధులు నటుకుల మోహన్, మెట్ట అనంతభట్లు, కమిటీ సమన్వయకర్త ఎం.వి.ఎస్.ఎస్.శాస్త్రి, వంగా మహేష్ దేవ్ తదితరులు పాల్గొన్నారు.



గాంధీ మందిరంలో దిలీప్‌కుమార్, కమిటీ ప్రతినిధులు

ఇద్దరు ఉపాధి వేతనదారులకు పాముకాటు



చికిత్స పొందుతున్న సూర్యకాంతం

రణస్థలం: ఇద్దరు ఉపాధి హామీ పథకం వేతనదారులు పాముకాటుకు గురయ్యారు. ఈ సంఘటన మండలంలోని వెంకటరావుపేట, నెలివాడ గ్రామాల్లో బుధవారం చోటుచేసుకుంది. ఎన్‌ఆర్‌జీఎస్ ఏపీవో ఎం.శ్రీనివాసనాయుడు తెలిపిన వివరాల ప్రకారం.. వెంకటరావుపేట గ్రామంలో కొత్తకోట్ల లక్ష్మి చెరువులో పని చేస్తుండగా పాము కాటుకు గురికావడంతో హుటాహుటీనా రణస్థలం సామాజిక ఆరోగ్య కేంద్రం తరలించి చికిత్స అందించారు. అలాగే నెలివాడలో చెరువు పనులు చేస్తుండగా నౌకట్ల సూర్యకాంతం పాము కాటుకు గురికావడంతో ఆమెను కూడా సామాజిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స అందజేశామని చెప్పారు. ప్రమాదకరమైన విషసర్పాలు కాకపోవడంతో ఎటువంటి ప్రాణహాని లేదని చెప్పారు. మహిళలిద్దరిని 24 గంటల ప్రత్యేక పరిశీలనలో ఉంచుతున్నట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ ఎం.వి.ప్రసాద్‌రావు తెలిపారు. ఇద్దరూ కోలుకుంటున్నారన్నారు. వేతనదారులను ఎంపీడీవో వి.ధనుంజయరావు పరామర్శించి యోగ క్షేమాలు తెలుసుకున్నారు.

పదోన్నతుల పర్వం ప్రారంభం

● ఎస్‌జీటీలకు స్కూల్ అసిస్టెంట్లుగా ప్రమోషన్
● తొలుత ఇంగ్లీషు, మ్యాథ్స్, ఫిజికల్ ఎడ్యుకేషన్ పదోన్నతులు
● సీనియారిటీ జాబితాను వెబ్‌సైట్‌లో పొందుపర్చిన అధికారులు
● నేడు, రేపు అభ్యంతరాల స్వీకరణ
● సద్వినియోగం చేసుకోవాలని డీఈఓ పిలుపు



జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయం

శ్రీకాకుళం న్యూకాలనీ: సర్కారీ బడుల్లో గురువుల పదోన్నతులకు ప్రభుత్వం రంగం సిద్ధం చేసింది. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం మనబడి నాడు-నేడుతో ప్రభుత్వ బడులను తీర్చిదిద్దింది. ఇంగ్లీషు మీడియంను చేరువ చేసింది. విద్యార్థులకు జగనన్న గోరుముద్ద పేరిట పౌష్టికరమైన భోజనం, ఆరోగ్యవంతమైన రాగి మాల్ట్‌తో చదువుకునేందుకు అవసరమైన అన్ని వస్తువులతోకూడిన జగనన్న విద్యాకానుకను అందిస్తోంది. ఇతర అన్ని రకాలైన మౌలిక వసతులు కల్పిస్తోంది. అన్నింటికంటే ముఖ్యంగా పాఠాలు బోధించే నాణ్యమైన, అర్హత కలిగిన టీచర్లు ఉండేలా చర్యలు తీసుకుంటోంది. ఈ నేపథ్యంలో వేసవి సెలవుల్లోనే పదోన్నతులను పూర్తిచేయాలని నిర్ణయించింది. కొత్త విద్యా సంవత్సరంలో ఉపాధ్యాయులు లేమితో స్కూళ్లు ఉండకూడదన్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు విద్యాశాఖ ఉన్నతాధికారులు నడుం బిగించారు. ఇప్పటికే పాఠశాల విద్యా కమిషనర్ జారీ చేసిన మార్గదర్శకాల మేరకు పదోన్నతల ప్రక్రియకు జిల్లాలో అధికారులు సమాయత్తమయ్యారు.

తొలుత వీరికే...

పదోన్నతుల్లో భాగంగా తొలుత స్కూల్ అసిస్టెంట్ (ఎస్ఏ) ఇంగ్లిషు, మ్యాథ్స్, ఫిజికల్ ఎడ్యుకేషన్ పోస్టులను భర్తీ చేయనున్నారు. ఆయా సబ్జెక్టులకు సంబంధించి అర్హత కలిగిన సెకండరీ గ్రేడ్ టీచర్లు (ఎస్‌జీటీలు), పీఈటీ, తత్సమాన కేటగిరి సీనియారిటీ కలిగిన ఉపాధ్యాయులకు స్కూల్ అసిస్టెంట్లుగా ఉద్యోగోన్నతి కల్పించనున్నారు.

సీనియారిటీ జాబితా సిద్ధం..

జిల్లా పదోన్నతలకు సంబంధించి అర్హత కలిగిన ఉపాధ్యాయులతో కూడిన సీనియారిటీ జాబితాను సిద్ధం చేశారు. దీనిని జిల్లా విద్యాశాఖకు చెందిన అధికారిక వెబ్‌సైట్ 'డీఈవోఎస్‌కెఎల్ఎం.ఓఆర్‌జీ'లో పొందుపర్చారు. ఈ సీనియారిటీ జాబితాకు సంబంధించి ఉపాధ్యాయుల నుంచి అభ్యంతరాలను స్వీకరించి వాటిని సరిచేసేలా అధికారులు చర్యలు తీసుకోనున్నారు. ఈ నెల 18, 19 తేదీల్లో డీఈఓ కార్యాలయంలో అభ్యంతరాలను స్వీకరించనున్నారు. గడువు ముగిసిన తర్వాత వచ్చిన అభ్యంతరాలను స్వీకరించబోమని జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ ఎస్.తిరుమల చైతన్య స్పష్టం చేశారు. సీనియర్ ఉపాధ్యాయులు తప్పనిసరిగా వారి పేర్లను జాబితాలో నమోదు చేసుకోవాలని సూచించారు. ఉపాధ్యాయులంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరుతున్నారు.

క్లుప్తంగా

పెద్దమనిషిపై దాడి



చికిత్సపొందుతున్న దుర్గారావు, గౌరీశ్వరరావు

పార్వతీపురం: ఇద్దరి మధ్య జరుగుతున్న గొడవను సర్ది చెప్పడానికి వెళ్లిన పెద్దమనిషిపై దాడి జరిగింది. ఈ సంఘటనపై పార్వతీపురం ఆస్పత్రి అవుట్‌పోస్టు పోలీసులు బుధవారం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బలిజిపేట మండలం పెద్దింపేట గ్రామంలో సిమెంట్ గోడకు ప్లాస్టింగ్ చేయకపోవడంతో నీరుకారి ఇంటిలోకి వస్తోందని మంతిని గౌరీశ్వరావు, పెంకి శ్రీనుల మధ్య గొడవ మంగళవారం రాత్రి జరుగుతోంది. ఈ విషయంలో కలుగజేసుకున్న మజ్జి దుర్గారావు ఇద్దరికీ సర్ది చెబుతున్నప్పుడు పెంకి శ్రీను కొడుకులు అరవింద్, లవణాలు మీరు ఎవరు మాకు చెప్పడానికి అంటూ దురుసుగా వచ్చి దుర్గారావుపై వెదురు కర్రలతో దాడి చేశారు. ఈ దాడిలో దుర్గారావుకు పలుచోట్ల గాయాలయ్యాయి. అలాగే మంతిని గౌరీశ్వరరావును కూడా కొట్టారు. దీంతో గాయాలపాలైన ఇద్దరిని 108 వాహనం ద్వారా పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్నారు.

40 మద్యం సీసాలతో వ్యక్తి అరెస్ట్

గజపతినగరం: మండలంలోని ఎం.వెంకటాపురం గ్రామంలో అక్రమంగా మద్యం వ్యాపారం సాగిస్తున్న వియ్యపు అప్పలరాజును అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై గంగరాజు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన స్థానిక పోలీస్‌స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడారు. మండలంలోని కాలంరాజుపేట గ్రామానికి చెందిన వి.అప్పలరాజు అక్రమంగా మద్యం అమ్మకాలు సాగిస్తున్నాడన్న సమాచారం మేరకు నిఘా వేసి ఎం.వెంకటాపురం గ్రామంలో నిందితుడిని అదుపులోకి తీసుకుని 40మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్సై గంగరాజు వివరించారు.

కేజీ వెండి వస్తువుల చోరీ

కొత్తవలస: మండలంలోని మంగళపాలెం గ్రామంలో రెల్లివీధిలో ఎం.సూర్యప్రకాశ్ ఇంట్లో మంగళవారం రాత్రి దొంగలు పడి కేజీ బరువుగల వివిధ రకాల వెండి వస్తువులను దోచుకుపోయినట్లు బాధితుడు పోలీసులకు బుధవారం ఫిర్యాదు చేశాడు. వెండిచెంబు, వెండిగిన్నె, వెండి కుంకుమ భరిణె, వెండి ప్లేట్ తదితర వస్తువులను ఇంట్లో గల బీరువాలో పెట్టామని తెల్లవారున చూసేసరికి బీరువా చిందరవందరగా ఉండడంతో పరిశీలించగా వెండివస్తువులు లేవని బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కె.వెంకటేశ్వర్లు తెలిపారు.

20, 21 తేదీల్లో అండర్-19 రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు

- నేడు కబడ్డీ, ఖోఖో అంశాల్లో తుది జట్టు ఎంపికలు

విజయనగరం: అండర్-19 స్కూల్ గేమ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 20, 21 తేదీల్లో విజయనగరం వేదికగా రాష్ట్రస్థాయి బాల, బాలికల కబడ్డీ పోటీలు నిర్వహించనున్నట్లు అసోసియేషన్ కార్యదర్శి పీవీఎల్ కృష్ణ బుధవారం తెలిపారు. నగరంలోని రాజీవ్‌క్రీడా మైదానం ప్రాంగణంలో రెండు రోజుల పాటు నిర్వహించే పోటీల్లో రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు చెందిన బాల, బాలికలు పాల్గొంటారని పేర్కొన్నారు. ఈ పోటీల్లో పాల్గొనబోయే జిల్లా తుది జట్టు ఎంపిక పోటీలు ఈ నెల 18న సాయంత్రం 4 గంటలకు రాజీవ్ క్రీడామైదానంలో నిర్వహించనున్నామన్నారు. ఇప్పటికే జరిగిన ఎంపిక పోటీల్లో ప్రాబబుల్స్ జట్టుకు అర్హత సాధించిన కబడ్డీ, ఖోఖో క్రీడాకారులు విధిగా తుది జట్టు ఎంపిక పోటీలకు హాజరుకావాలని స్పష్టం చేశారు.

వీనులవిందుగా శ్రీకృష్ణుని జన్మ వృత్తాంతము



బొబ్బిలిలో ప్రవచిస్తున్న బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు

బొబ్బిలి: శ్రీ కృష్ణుని లీలలు, జన్మ వృత్తాంతం ఆబాలగోపాలానికీ వీనులవిందైనదని బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు అన్నారు. బొబ్బిలి సంస్థానం ఉన్నత పాఠశాల మైదానంలో రెండు రోజుల ప్రవచన కార్యక్రమాన్ని బుధవారం రాత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన శ్రీకృష్ణుడు జన్మించిన నాటి నుంచి అతని లీలలు, ఘట్టాలను భక్తులకు కళ్లకు కట్టినట్టుగా వివరించారు. మానవ జీవితాన్ని పరిపూర్ణం చేసుకోవాలంటే శ్రీకృష్ణుని లీలలను అనుసరించాలన్నారు. ముందుగా బొబ్బిలి ప్రాంతం గురించి, ఇక్కడి వీణల గూర్చి విన్నానని, ఎంతో పేరు ప్రఖ్యాతులు పొందినవనీ కొనియాడారు. కార్యక్రమంలో పలువురు పుర ప్రముఖులు పాల్గొన్నారు.

కిలాడీ దంపతుల అరెస్ట్

- ఉద్యోగాలు వేయిస్తామని రూ.2కోట్లకు పైగా వసూలు
- ఏడాదిగా పరారీలో భార్యాభర్తలు
- రాజస్థాన్‌లో అరెస్ట్ చేసిన పోలీసులు



పోలీసులు అరెస్ట్ చేసిన భార్యాభర్తలు

తెర్లాం: ఆంధ్రా యూనివర్సిటీలో ఉద్యోగాలు ఇప్పిస్తామని నమ్మించి ఒక్కో ఉద్యోగానికి రూ.3లక్షల నుంచి రూ.6లక్షల వరకు నిరుద్యోగుల నుంచి వసూలు చేసి సుమారు రూ.2కోట్లతో పరారైన దంపతులను స్థానిక పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ ఘటనకు సంబంధించి తెర్లాం ఎస్సై ఆర్.రమేష్ బుధవారం తెలియజేసిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని పెరుమాళి గ్రామానికి చెందిన బేరి గంగాధర్, భార్య పూర్ణచందనలు ఏయూలో ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ పద్ధతిపై ఉద్యోగాలు వేయిస్తామని నమ్మించి వారి బంధువుల వద్ద, వేరే ప్రాంతాలకు చెందిన ఇతరులు, మధ్యవర్తుల వద్ద ఏడాది క్రితం సుమారు రూ.2కోట్లకు పైగానే వసూలు చేశారు. ఉద్యోగాలు వేయిస్తామని డబ్బులు తీసుకున్న వారిలో ఒకరిద్దరికి ఆంధ్రా యూనివర్సిటీలో ఉద్యోగం ఇచ్చినట్లు నకిలీ నియామక పత్రం, ఇడెంటిటీకార్డులు చూపించగా చాలామంది ఉద్యోగాలు వస్తాయని ఆశపడి వారు అడిగినంత ఇచ్చారు. డబ్బులు తీసుకున్న తరువాత ఎప్పటికీ ఉద్యోగాలు ఇవ్వకపోవడంతో మాకు ఉద్యోగాలైనా ఇవ్వండి, లేదా డబ్బులైనా ఇవ్వండని గంగాధర్, భార్య పూర్ణచందనను బాధితులతోపాటు, మధ్యవర్తులుగా ఉండి డబ్బులు ఇప్పించిన వారు విశాఖపట్నంలో వారు నివాసముంటున్న ఇంటికి వెళ్లి డిమాండ్ చేశారు. కొద్దిరోజుల్లో ఉద్యోగాలు ఇప్పిస్తామని, లేదంటే డబ్బులు తిరిగి ఇస్తామని నమ్మించి అక్కడి నుంచి వేరే రాష్ట్రాలకు భార్యాభర్తలిద్దరూ పరారయ్యారు.

దంపతుల కదలికపై నిఘా

దీంతో బాధితుల్లో కొంతమంది తెర్లాం పోలీస్‌స్టేషన్‌లో కొన్ని నెలల క్రితం ఫిర్యాదు చేశారు. అప్పట్లో ఉన్న ఎస్సై బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన తరువాత బదిలీపై వెళ్లిపోయారు. ఆ తరువాత తెర్లాం ఎస్సై విధుల్లో చేరిన ఆర్.రమేష్ ఈ కేసుపై పూర్తిస్థాయిలో దర్యాప్తు చేపట్టారు. గంగాధర్, ఆయన భార్య కదలికలపై నిఘా వేసి వారు రాజస్థాన్‌లో ఉన్నట్టు తెలుసుకుని బాధితుల్లో ఒకరిని, సిబ్బందిని అక్కడికి పంపించి వారిని పట్టుకుని మంగళవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చారు. ఎస్సై రమేష్ ఉన్నతాధికారులకు ఈ విషయాన్ని తెలియజేసి, భార్యభర్తలను మంగళవారం అరెస్ట్ చేసి బొబ్బిలి కోర్టుకు తరలించారు.

పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత



సమావేశంలో అధికారులతో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్

- విద్యార్థి దశ నుంచే అవగాహన కలిగించాలి
- జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్

విజయనగరం అర్బన్: ఆరోగ్యకరమైన సమాజానికి పర్యావరణ పరిరక్షణ తప్పనిసరి అని, పర్యావరణాన్ని పరిరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ అన్నారు. మిషన్ లైఫ్‌లో భాగంగా పర్యావరణ ప్రవర్తనలో మార్పు అనే అంశంపై ప్రభుత్వ శాఖల అధికారులతో జేసీ ఆధ్వర్యంలో బుధవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పర్యావరణ పరిరక్షణకు పలు శాఖల ద్వారా చేపట్టనున్న కార్యాచరణపై జేసీ పలు సూచనలు చేశారు. విద్యుత్తును, నీటిని పొదుపుగా వాడాలని, ఈ విషయాలపై ఆయా శాఖలు విస్తృత అవగాహన కలిగించాలన్నారు. పర్యావరణానికి ముప్పు కలిగించే సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను పూర్తిగా నిషేధించాలని, ఈ వేస్ట్‌ను తగ్గించాలని కోరారు. తడిచెత్త పొడిచెత్తలను వేరు చేసి శాస్త్రీయంగా నిర్వహించాలని సూచించారు. పచ్చదనాన్ని పెంచి, సేంద్రియ ఆహారాన్ని వినియోగించి ఆరోగ్యకరకరమైన వాతావరణంలో జీవించేలా చూడాలని హితవు పలికారు. విద్యార్థి దశ నుంచి పర్యావరణంపై అవగాహన కలిగించాలని లేకుంటే భవిష్యత్తు కాలుష్య కోరల్లో చిక్కుకుంటుందని, అందుకోసం ప్రతి పాఠశాల, కళాశాలలో అవగాహన తరగతులు నిర్వహించాలని సూచించారు. సమావేశంలో జిల్లా అటవీశాఖ అధికారి, డీఆర్‌డీఏ పీడీ, డీపీవో, డీఈవో, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ, పోలీస్ శాఖ అధికారులతో పాటు మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

ఆటో బోల్తా: ఐదుగురికి గాయాలు

గుమ్మలక్ష్మీపురం/కురుపాం: గుమ్మలక్ష్మీపురం మండలం అచ్చబ గ్రామ సమీపంలోని ఘాట్‌రోడ్డులో ఆటో బోల్తా పడడంతో ఐదుగురికి తీవ్రంగా గాయాలయ్యాయి. వివరాలిలా ఉన్నాయి. హైదరాబాద్‌లో నివాసముంటున్న సతివాడ చిన్నారావు, గౌరీశ్వరి, సీతాదేవి, మహాలక్ష్మి, అభిలాష్‌లు కొమరాడ మండలం వన్నాంలోని బంధువుల ఇంటికి కొద్ది రోజుల క్రితం వచ్చారు. అక్కడి నుంచి ఒడిశా రాష్ట్రంలోని రాయగడ మజ్జి గౌరమ్మ ఆలయానికి దర్శనం నిమిత్తం వెళ్లి వస్తుండగా ఘాట్‌రోడ్డు వద్ద అదుపుతప్పి ఆటో బోల్తా పడగా ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదాన్ని అటుగా వెళ్తున్న వారు గమనించి క్షతగాత్రులను కురుపాం ఆస్పత్రికి తీసుకువెళ్లగా వైద్యాధికారి శ్రీధర్ ప్రథమ చికిత్స అందించారు. గాయపడిన వారిలో అభిలాష్ కాలు విరిగిపోగా, మహాలక్ష్మి, గౌరీశ్వరిల పరిస్థితి ఆందోళన కరంగా ఉండడంతో పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి రిఫర్ చేశారు. ఈ సంఘటనపై ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



కురుపాం ఆస్పత్రిలో అభిలాష్‌కు చికిత్స అందిస్తున్న దృశ్యం

108 వాహనం ఢీకొని ఒకరికి..

పార్వతీపురం: వంగర మండలం బేగంపేట గ్రామానికి చెందిన జి. తిరుపతిరావు ద్విచక్ర వాహనంపై వస్తుండగా వెనుక నుంచి 108 అంబులెన్స్ ఢీకొనడంతో గాయాలపాలయ్యాడు. తిరుపతిరావు పార్వతీపురం ఫ్లైఓవర్‌పై నుంచి సాయిబాబా గుడి రహదారిగుండా ద్విచక్రవాహనంపై వస్తుండగా సాయిబాబా గుడి సమీపంలో 108 అంబులెన్సు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తిరుపతిరావుకు పలుచోట్ల గాయాలుకాగా అదే 108 వాహనంలో చికిత్సకోసం పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తరలించారు.



పార్వతీపురం: చికిత్స పొందుతున్న తిరుపతిరావు

ద్విచక్రవాహనం ఢీకొని వాకర్‌కు..

మార్నింగ్ వాక్ చేస్తున్న వ్యక్తిని ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనం ఢీ కొట్టడంతో గాయాలపాలయ్యాడు. పార్వతీపురం నుంచి నర్సిపురంవైపు మార్నింగ్ వాక్ చేస్తున్న లాడి ప్రభాకర్‌ను నర్సిపురంనుంచి పార్వతీపురం వైపు వస్తున్న ద్విచక్ర వాహన చోదకుడు బలంగా ఢీకొట్టాడు. ఈ ఘటనలో ప్రభాకర్‌కు పలుచోట్ల గాయాలయ్యాయి. ఈ మేరకు స్థానికులు 108 వాహనంద్వారా పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి చికిత్సకోసం తరలించారు.



చికిత్స పొందుతున్న ప్రభాకర్

ఆత్మహత్యపై అనుమానాలు



పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని బయటకు తీస్తున్న దృశ్యం

రామభద్రపురం: మండలంలోని ముచ్చర్లవలస గ్రామంలో ఇటీవల యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటనలో అనుమానాలు వ్యక్తంచేస్తూ కుటుంబసభ్యులు పోలీసులకు బుధవారం ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన రేగాన గణేశ్వరరావు(29) ఈ నెల 10వ తేదీ వేకువజామున ఇంటి వెనుక ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీంతో వారి సంప్రదాయం ప్రకారం కుటుంబసభ్యులు అంత్యక్రియలు పూర్తి చేశారు. అయితే వారం రోజులు పోయాక ఆ ఆత్మహత్యపై అనుమానాలు వ్యక్తం చేస్తూ, ఇది ఆత్మహత్య కాదని, దీని వెనుక కొంత మంది వ్యక్తులు కారణమై ఉంటారని, దర్యాప్తు చేసి న్యాయం చేయాలని కోరుతూ 16వ తేదీన మృతుడి కుటుంబసభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఎస్సై సురేంద్రనాయుడు ఆధ్వర్యంలో పీహెచ్‌సీ వైద్యాధికారి, ఇన్‌చార్జి తహసీల్దార్, వీఆర్వోలు పాతిపెట్టిన మృతదేహాన్ని బుధవారం బయటకు తీసి పోస్టుమార్టం నిర్వహించారు. ఎస్సై కేసు నమోదుచేసి దర్యాప్తుచేస్తున్నారు.

వీఆర్వోకు షోకాజ్ నోటీసు

సీతానగరం: మండలంలో విధులు సక్రమంగా నిర్వహించక, రీ సర్వే పనులు నిర్వహించక అధికారులకు ఎటువంటి సమాచారం లేకుండా విధులకు డుమ్మా కొడుతున్నారని ప్రజలనుంచి అందిన అభియోగాలపై సూరంపేట వీఆర్వో వి.పాణిగ్రాహికి కలెక్టరేట్ నుంచి జారీ అయిన షోకాజ్ నోటీసు అందచేశామని హెచ్‌డీటీ షేక్ ఇబ్రహీం తెలియజేశారు. ఈ మేరకు బుధవారం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నిర్వహించే భూముల రీ సర్వే పనులను క్లస్టర్ పరిధిలో నిర్వహించక పోగా, ఉన్నతాధికారులనుంచి వస్తున్న ఫోన్‌కాల్స్‌కు స్పందించకుండా ఫోన్ స్విచాఫ్ చేయడం, విధులకు క్రమంగా హాజరుకాకపోవడానికి గల కారణాలు, ప్రజల నుంచి వస్తున్న ఫిర్యాదులను పట్టించుకోనందుకు గల కారణాలపై లిఖిత పూర్వకంగా ఆయన సమాధానం ఇవ్వాలని నోటీసుజారీ అయిందన్నారు. సమాధానం సంతృప్తిగా లేని పక్షంలో ఉన్నతాధికారులు తీసుకునే చర్యలకు బాధ్యులవుతారని నోటీసులో పేర్కొన్నట్లు వివరించారు.

117 మంది జన్మభూమి ఇళ్లపట్టాల రద్దు

కొత్తవలస: గత ప్రభుత్వం హయాంలో నిర్వహించిన జన్మభూమి–మా ఊరు కార్యక్రమంలో భాగంగా 6వ విడత కొత్తవలస మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు కొత్తవలస రెవెన్యూ పరిధిలో సర్వేనంబర్ 168,173లలో 2019లో 679 మందికి ఇళ్లపట్టాలను అప్పట్లో అందజేశారు. కాగా ప్రస్తుతం ఈ పట్టాలపై విచారణ చేయగా పట్టాలు పొందిన వారిలో 117 మందిని అనర్హులుగా గుర్తించినట్లు తహసీల్దార్ మేమంత్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ 117 మంది పట్టాలను రద్దు చేయాలని ఆర్‌డీఓకు నివేదించినట్లు చెప్పారు. ఈ పట్టాల రద్దుపై ఎవరికైనా అభ్యంతరాలు ఉంటే 7 రోజుల్లో లిఖితపూర్వకంగా కొత్తవలస తహసీల్దార్‌ను సంప్రదించాలని సూచించారు. కాగా అర్హత కలిగిన 562 మంది మరోమారు ఆయా గ్రామాల సచివాలయాల్లో ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని స్పష్టం చేశారు.

చోరీ కేసులో నిందితుడి అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న టూటౌన్ సిఐ సిహెచ్.లక్ష్మణరావు (వెనుక ముసుగులో నిందితుడు)

విజయనగరం క్రైమ్: చోరీ కేసులో నిందితుడ్ని టూటౌన్ పోలీసులు బుధవారం అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు టూటౌన్ సీఐ సీహెచ్.లక్ష్మణరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గాజులరేగకు చెందిన వై.నూకరాజు ఈ నెల 15న రాత్రి ఇంటికి తాళం వేసి డాబాపై నిద్రిస్తుండగా అదేవీధికి చెందిన దుర్గాప్రసాద్ ఇంటి తాళం పగులగొట్టి, లోపలికి ప్రవేశించాడు. బీరువా తెరిచి ఎటువంటి విలువైన వస్తువులు దొరక్కపోవడంతో ఇంట్లో ఉన్న మొబైల్ ఫోన్ తీసుకువెళ్తుండగా శబ్దం రావడంతో నూకరాజు లేవగా నిందితుడు పారిపోయాడు. తరువాత నూకరాజు ఇంట్లోకి వెళ్లిచూడగా వస్తువులన్నీ చిందరవందరగా ఉండడం, సెల్‌ఫోన్ పోయినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదుచేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు విచారణ చేపట్టగా స్థానిక పుత్సల వీధిలో అనుమానాస్పదంగా తిరుగుతున్న నిందితుడు దుర్గాప్రసాద్‌ను ఎస్సై షేక్‌శంకర్ పట్టుకుని విచారణ చేశారు. అనంతరం నిందితుడి దగ్గర నుంచి మొబైల్ ఫోన్ రికవరీ చేసి రిమాండ్‌కు తరలించారు.

విద్య, గృహరుణాలు మంజూరు చేయాలి

- కలెక్టర్ నిషాంత్‌కుమార్

పార్వతీపురం: ఆర్థికాభివృద్ధిలో బ్యాంకులు కీలకమని వివిధ రంగాలకు రుణాలను అందించాలని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ నిషాంత్‌కుమార్ పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం కలెక్టర్‌లోని సమావేశ మందిరంలో బ్యాంకర్లతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యాంకుల లక్ష్యాలు, రుణాల మంజూరుపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మధ్యతరగతి, అల్పాదాయవర్గాల వారికి కూడా గృహనిర్మాణానికి రుణాలు మంజూరు చేయాలని సూచించారు. చదువుకునేందుకు అవసరమైన ఆర్థిక వనరులను విద్యారుణాలద్వారా బ్యాంకులు సమకూర్చాలని స్పష్టం చేశారు. అటవీ ఉత్పత్తులు, ఇతర పంటల సాగుకు, ఆర్‌ఓఎఫ్‌ఆర్ భూములకు వ్యవసాయ భూములతో రుణాలను మంజూరుచేయాలని చెప్పారు. స్వయం సహాయక సంఘాలకు పశుసంవర్ధక యూనిట్లు మంజూరుచేయాలని సూచించారు. కేంద్ర ఆర్థికశాఖ ఆదేశాల ప్రకారం ఆర్థిక వనరులు సమకూర్చడంద్వారా వేగంగా అభివృద్ధి చెందేందుకు అవకాశం గల 112 వెనుకబడిన జిల్లాల్లో పార్వతీపురం ఒకటిగా గుర్తించారన్నారు.



బ్యాంకర్లతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నిషాంత్‌కుమార్

ఇబ్బందులుంటే తెలియజేయండి

లీడ్ బ్యాంక్ మేనేజర్ జేఎల్ఎస్.మూర్తి మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న వివిధ పథకాల్లో రుణాలకు సంబంధించి దరఖాస్తులను బ్యాంకర్లు తిరస్కరించకూడదని, రుణాల మంజూరులో ఇబ్బందులుంటే సంబంధిత శాఖాధికారులకు తెలియజేయాలని కోరారు. సమావేశంలో జిల్లా వ్యవసాయాధికారి కె.రాబర్ట్‌పాల్, పశుసంవర్ధక శాఖాధికారి ఎ.ఈశ్వరరావు, ఉద్యాన శాఖ అధికారి కేఎస్ఎన్.రెడ్డి, మత్స్యశాఖాధికారి వి.తిరుపతయ్య, డీఆర్‌డీఏ పీడీ కిరణ్‌కుమార్ టీపీఎంయూ ఏపీడీ వై.సత్యంనాయుడు, జిల్లా పరిశ్రమల అధికారి సీతారామ్ తదితరులు పాల్గొన్నారు.

సాగుకు భరోసాతో రైతు ఉత్సాహం

- జిల్లాలో 2,57,413 మంది లబ్ధిదారులు
- ఆర్బీకేల్లో అర్హుల జాబితా
- నాలుగో ఏడాది రైతు భరోసా పంపిణీకి చర్యలు



నాయుడువలస ఆర్బీకేలో వైఎస్సార్ రైతుభరోసా అర్హుల జాబితా ప్రదర్శిస్తున్న సచివాలయ సిబ్బంది

రామభద్రపురం: గతంలో అన్నదాతలు పొలాలను సాగు చేసేందుకు సీజన్ ప్రారంభంలో వడ్డీ వ్యాపారుల వద్ద వడ్డీకి అప్పు తెచ్చుకోవాల్సిన దుస్థితి ఉండేది. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు.ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు అన్నదాతలకు అండగా నిలుస్తున్నారు. రైతు భరోసా పథకం ద్వారా ఆర్థికంగా రైతులను ఆదుకుంటున్నారు.అందులో భాగంగానే నాలుగో విడత రైతు భరోసా డబ్బును వారి అకౌంట్లలో జమ చేసేందుకు సిద్ధమవుతున్నారు.

జిల్లాలో మంది 2,57,413మంది అర్హులు

విజయనగరం జిల్లా వ్యాప్తంగా రైతు భరోసా, పీఎం కిసాన్ పథకాన్ని గతంలో పొందుతున్న వారు 2,51,659 మంది కాగా కొత్తగా దరఖాస్తు చేసుకున్నా వారు 5,754 మంది. మొత్తం కలిపి 2,57,413 మంది రైతులు అర్హులుగా ఎంపికయ్యారు. వారికి రైతు భరోసా నగదు జమ కానుంది.

రైతు భరోసా పొందడం ఇలా..

భూమి ఉన్న ప్రతి రైతు రైతుభరోసా నగదు పథకానికి అర్హుడు. అలాగే ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి యోజన కింద ప్రయోజనం పొందే వారంతా ఈ పథకానికి అర్హులే. పట్టాదారు పాస్‌పుస్తకం, ఆధార్‌కార్డు, బ్యాంకు పాస్‌పుస్తకం తీసుకుని స్థానిక ఆర్బీకేలలోని వీఏఏలకు అందజేస్తే వారు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు. ఇందులో కేంద్రప్రభుత్వం మూడు విడతలలో రూ.2 వేల చొప్పున జమచేయగా రాష్ట్ర ప్రభుత్వం అదనంగా మరో రూ.7.500 జమ చేస్తుంది. దీంతో ప్రతి రైతన్నకు ఏటా రూ.13,500 పెట్టుబడి సాయం అందుతుంది.

గత ప్రభుత్వాలు పట్టించుకోలేదు



గత ప్రభుత్వాలు రైతుల గురించి కనీసం పట్టించుకోలేదు.మూడేళ్ల నుంచి ఏటా రైతుభరోసా డబ్బు ఖాతాలో జమఅవుతోంది. ఖరీఫ్ ప్రారంభంలో ప్రభుత్వం చేస్తున్న సాయం సేద్యపు ఖర్చులకు ఎంతగానో ఉపయోగపడుతోంది. రైతులకు ఇచ్చిన మాట ప్రకారం మాట తప్పని నేతగా సీఎం జగన్ సాయం చేస్తున్నారు.

గుల్లిపల్లి అప్పారావు, రైతు,రామభద్రపురం

ముఖ్యమంత్రికి రుణపడి ఉంటాం

గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా రైతు భరోసా ద్వారా రూ.13,500 ప్రభుత్వం సాయంతో కొంత మేర అప్పుల బాధ తప్పింది.ఖరీఫ్ ప్రారంభంలో పెట్టుబడి సాయం వ్యవసాయ ఖర్చులకు ఎంతగానో ఉపయోగపడుతోంది. ముఖ్యమంత్రి మా లాంటి రైతులకు ఎనలేని సేవలు అందిస్తున్నారు. మా రైతులమంతా రుణపడి ఉంటాం.

కేతిరెడ్డి రామారావు, రైతు, నాయుడువలస

రైతులందరికీ రైతు భరోసా

వైఎస్సార్ రైతు భరోసాకు సంబంధించి ఏ ఒక్క రైతుకు అన్యాయం జరగదు. ఇప్పటికే ఆర్బీకేలలో అర్హుల జాబితాను నోటీస్‌బోర్డులో ఉంచాం.జాబితాలో పేరు లేకుంటే ఈ నెల 18వ తేదీలోపు వీఏఏలను సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలి. పరిశీలించి అర్హత ఉంటే నమోదు చేస్తారు.

వీటీ రామారావు, జిల్లా వ్యవసాయశాఖాధికారి, విజయనగరం

ప్రకృతితో సాగుదాం

- పిలుపునిచ్చిన అధికారులు
- మిషన్ లైఫ్‌లో భాగంగా పట్టణంలో భారీ సైకిల్ ర్యాలీ



పర్యావరణ పరిరక్షణ ర్యాలీని ప్రారంభిస్తున్న జిల్లా అధికారులు

విజయనగరం రూరల్: ప్రతి ఒక్కరం ప్రకృతితో సాగుతూ, పర్యావరణ పరిరక్షణకు పాటుపడదామని పర్యావరణ ఇంజినీర్ టి.సుదర్శనం, సెట్విజ్ సీఈఓ బి.రామగోపాల్‌లు పేర్కొన్నారు. ప్రకృతితో మమేకమయ్యే జీవనశైలిని ఏర్పరచుకునే దిశగా ప్రజలను సమాయత్తం చేయడానికి రూపొందించిన మిషన్‌లైఫ్ కార్యక్రమంలో భాగంగా స్థానిక రాజీవ్ స్టేడియం వద్ద సైకిల్ ర్యాలీని బుధవారం సెట్విజ్ సీఈఓ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా పర్యావరణ ఇంజినీర్ సుదర్శనం మాట్లాడుతూ పర్యావరణానికి ముప్పు కలిగించే సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను పూర్తిగా నిషేధించాలన్నారు. మొక్కలను నాటి పచ్చదనాన్ని పెంపొందించుకోవాల్సిన అవసరం అందరిపైనా ఉందన్నారు. కాలుష్య నియంత్రణకు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని, ఎలక్ట్రికల్, ఇ–బైక్‌ల వినియోగం పెంచాలన్నారు. విద్యార్థి దశ నుంచే పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించుకోవాలని, భావితరాల మేలు కోసం నీటి వనరులు, అడవుల సంరక్షణ, ఇ-వ్యర్థాల తగ్గింపునకు కృషి చేయాలన్నారు. అనంతరం సైకిల్ ర్యాలీని రాజీవ్ స్టేడియం నుంచి గంటస్తంభం, బాలాజీ కూడలి, ఆర్టీసీ కాంప్లెక్స్ మీదుగా రైల్వేస్టేషన్ వరకు నిర్వహించారు.

కార్యక్రమంలో ఎఫ్ఆర్ఓ బి.అప్పలరాజు, ఎఫ్ఎస్ఓ కె.వి.ఎస్.రాజు, యువజన సాధికార త అభివృద్ధి, జిల్లా క్రీడా సాధికారత సంస్థ, కాలుష్య నియంత్రణ మండలి సిబ్బంది, అటవీ, మున్సిపల్, రవాణా శాఖ సిబ్బంది, పలు ఫార్మా కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

కూచిపూడిలో రితీషాకు జాతీయస్థాయి అవార్డు

విజయనగరం టౌన్: పట్టణానికి చెందిన టి.రితీష డ్యాన్స్ ఇండియా క్వీన్స్ స్పిరిట్స్ జాతీయస్థాయి అవార్డును కైవసం చేసుకుంది. ఈ మేరకు డ్యాన్స్ అకాడమీ నిర్వాహకుడు నాట్యాచార్య విక్రమ్ కుమార్ బుధవారం వివరాలు వెల్లడించారు. న్యూఢిల్లీలోని కళామంచ్ ఆడిటోరియంలో ఈ నెల 14 నుంచి మూడురోజుల పాటు జరిగిన అంతర్జాతీయ నృత్య దినోత్సవం-2023లో రితీష చేసిన కూచిపూడి నృత్యంలో దశవతారాల ప్రదర్శనకు అవార్డు లభించిందన్నారు. రితీషను జిల్లాకు చెందిన పలు సాంస్కృతిక సంస్థల ప్రతినిధులు, కుటుంబ సభ్యులు అభినందించారు.



అవార్డు అందుకుంటున్న రితీష